క్లుప్తంగా

నెట్టికంటుడికి విరాళం



సూపరింటెండెంట్ వెంకటేశులుకు నగదు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లు రూరల్: గుంతకల్లు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఆదివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ కుటుంబ సభ్యుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు.. సూపరింటెండెంట్ వెంకటేశులు ద్వారా ఆయనకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దశరథరెడ్డి, కసాపురం మాజీ సర్పంచ్ తిక్కస్వామి, బెస్త మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడి సేవలో ఆలూరు ఎమ్మెల్యే



స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి

గుంతకల్లు రూరల్: వైఎస్సార్‌సీపీ ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి ఆదివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వేకువజామునే ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే కుటుంబసభ్యుల పేరున అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఘనంగా హోల్కర్ జయంతి



హోల్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక రామ్‌చంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నెస్ ధ్యాన్య కేంద్రంలో ఆదివారం లోకమాత రాణి అహల్య భాయి హోల్కర్ 300వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు హాజరై హోల్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాసం రవిబాబు, శ్రీనివాసులు, పద్మా, అనిత, లక్ష్మీరంగయ్య, కవిత, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'సిందూర్' విజయోత్సవ ర్యాలీ



యాడికిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలో ఆదివారం సిందూర్ విజయోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పార్టీల కతీతంగా పెద్దఎత్తున రాజకీయ నాయకులు, విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టుకుని చెన్నకేశవస్వామి ఆలయం నుంచి ఓం శాంతి వరకు, ఆర్య వైశ్య వీధి నుంచి కోన రోడ్డు ద్వారా తిరిగి చెన్నకేశవ స్వామి ఆలయం వరకకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఉగ్రవాదులు భారత పౌరులపై జరిపిన దాడికి ప్రతిదాడిగా భారత బలగాలు చేపట్టిన చర్యకు 140 కోట్ల భారతీయులు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, తిరంపురం లక్ష్మయ్య, ఆదిత్య పవన్, మురళి, గంగాధర, చౌడయ్య, పూజారి ఆంజనేయులు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌరాణిక నాటక ప్రదర్శన



సౌరకాలయపేట గ్రామంలో పంచరత్నాలు పౌరాణిక నాటక ప్రదర్శన దృశ్యం

పామిడి: మండలంలోని సౌరకాలయపేట గ్రామంలో తెలుగుభాష సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో స్వరరాగ నాటక కళాసమితి సౌజన్యంతో శనివారం రాత్రంతా నిర్వహించిన పంచరత్నాలు పౌరాణిక నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. స్వరరాగ నాటక కళాసమితి సభ్యులు పుంజా కృష్ణారావుయాదవ్, దేవరాజు, రమణమూర్తి, ఆంథోని, హనుమంతరెడ్డి, వనజకుమారి, నాగవేణి పోటీ పడి నటించారు. ఈసందర్భంగా కళాకారులను గ్రామపెద్దలు ఘనంగా సత్కరించారు.

వేధిస్తున్న వైద్యుల కొరత



గుత్తి పెద్దాస్పత్రిలో వైద్యసేవలు అందక రోగులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా వైద్యుల కొరత వేధిస్తోంది. సకాలంలో వైద్యసేవలు అందడం లేదని గర్భిణులు, వారి బంధువులు వాపోతున్నా .. పట్టించుకునే వారులేరు. వైఎస్సార్‌సీపీ హయాంలో వైద్యసేవలు సకాలంలో అందేవని, కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పెద్దాస్పత్రిలో వైద్యసేవలు సరిగా అందించడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- గుత్తి ప్రభుత్వాస్పత్రిలో అందని వైద్య సేవలు
- అవసరం 11 మంది, ఉండేది ఐదుగురు వైద్యులు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



గుత్తి ప్రభుత్వాసుపత్రి



వైద్యుల కోసం వేచి ఉన్న రోగులు

గుత్తి: గుత్తి ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. అన్ని రకాల వైద్యులు కలిపి మొత్తం 11 మంది ఉండాలి. అయితే ప్రస్తుతం కేవలం ఐదుగురు వైద్యులు మాత్రమే ఉన్నారు. ఓపీ రోగుల సంఖ్య రోజూ 450 నుంచి 550 వరకు ఉంటోంది. అయితే వైద్యులు, సిబ్బంది కొరత రోగుల పాలిట శాపంగా మారుతున్నది. రోగులకు సరైన వైద్యం సకాలంలో అందడం లేదు. మూడు నెలల క్రితం వరకు ఎనిమిది మంది వైద్యులు ఉండేవారు. ఇందులో ఒకరు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. మరొకరు లాంగ్ లీవ్ పెట్టారు. ఇంకొకరు మెటర్నిటీ లీవ్‌లో వెళ్లారు. అలాగే ఆస్పత్రిలో స్పెషలిస్టు వైద్యులు లేరు. గైనకాలజిస్ట్ లేరు. దీంతో మహిళా రోగులు ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్యుల కొరతతో రోగులను అనంతపురం, కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు వ్యయప్రయాసలు, టెన్షన్‌కు గురవుతున్నారు. పేరుకు మాత్రమే పెద్దాసుపత్రి. కేవలం ఐదుగురు మాత్రమే వైద్యులు ఉండటంతో రోగులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మందులు కూడా సరిపడినన్నీ లేవు. రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో లేవు. ఉమ్మడి జిల్లాలో ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదని రోగులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యుల కొరత తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



వైద్యుల కొరత ఉన్న మాట వాస్తవం. 11 మంది వైద్యులకుగానూ కేవలం ఐదుగురు ఉన్నారు. ఓపీ సంఖ్య రోజూ గరిష్టంగా 550 దాకా ఉంటోంది. డాక్టర్లను నియమించాలని వైద్య శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఎల్లప్ప, సూపరింటెండెంట్, గుత్తి ప్రభుత్వాస్పత్రి

అవినీతి, అక్రమాలపై పోరాటం



మహాసభలకు హాజరైన నాయకులు

గుంతకల్లు రూరల్: రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న అవినీతి అక్రమాలపై పోరాటానికి కమ్యూనిస్టులు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.గోవిందు కోరారు. ఆదివారం స్థానిక బీటీ పక్కీరప్ప కాలనీలో 8వ సీపీఐ మహాసభలను నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన ఈ మహాసభల్లో జిల్లా, నియోజకవర్గ స్థాయిలో నాయకులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ రాజ్యాంగానికి విఘాతం కల్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న దుశ్చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. అదేవిధంగా రాష్ట్రంలో అవినీతి, అక్రమాలతోపాటు, మహిళలపై అత్యాచారాలు కూడా పెరిగిపోతున్న తరుణంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలన్నారు.

అనంతపురం దారి మూసివేత



శింగనమల నుంచి అనంతపురం వైపు వెళ్లే దారికి డివైడర్లను వేస్తున్న దృశ్యం

శింగనమల: శింగనమల నుంచి అనంతపురానికి కొన్ని దశాబ్దాలుగా మరువకొమ్మ క్రాస్ మీదుగా వెళ్లేవారు. కానీ అనంతపురం-విజయవాడ రహదారి 544–డీ రహదారి నిర్మాణంలో భాగంగా ఇప్పటి వరకూ వెళ్తున్న రోడ్డుపై ఇటీవల శింగనమల - అనంతపురం వైపు వాహనాలు, ద్విచక్రవాహనాలు వెళ్లకుండా డివైడర్లు వేశారు. దీంతో శింగనమల నుంచి అనంతపురానికి వెళ్లాలంటే మరువకొమ్మ నుంచి అర్థ కిలోమీటరు దూరంలోని పెద్దమ్మ గుడి వద్దకు వెళ్లి రోడ్డు క్రాస్ కావాలి. ఆ సమయంలో ఈ రోడ్డుపై అతి వేగంగా వాహనాలు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. దీనికి తోడు పెద్దమ్మ గుడి రోడ్డు క్రాస్ వద్ద విద్యుత్ దీపాలు లేకపోవడంతో రాత్రి పూట రోడ్డు క్రాస్ అయ్యే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. రహదారి నిర్మాణం జరుగుతున్నప్పటి నుంచి శింగనమల గ్రామస్తులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు శింగనమలకు వచ్చే విధంగా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు. అలాగే గ్రామస్తులు రోడ్డు నిర్మాణం పనుల వద్ద రాస్తారోకో చేపట్టారు. ప్రజా సంఘాల నాయకులు ప్రతి వారం వినూత్న చర్యలు ద్వారా సమస్యను ప్రభుత్వం తీసుకపోవడానికీ ధర్నాలు చేశారు. స్పందించిన ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కాని నేటికి అమలు కాలేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బి అధికారులు స్పందించి అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థినికి సత్కారం



విద్యార్థినిని సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వివేకానంద పాఠశాలలో ఆదివారం గత ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 992 మార్కులు సాధించిన మెహక్‌సుల్తానాను ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సమితి సభ్యులు సత్కరించారు. వారు మాట్లాడుతూ తాడిపత్రికి చెందిన మెహక్ సుల్తానా రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు గురప్ప, కన్వీనర్ నారబోయిన శంకర్, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, గౌరవ సభ్యులు చంద్రశేఖర్, పాజిల్, లక్ష్మీనారాయణ, పెద్దయ్య, దాదాపీర్, సుల్తానా తల్లిదండ్రులు షీమీర్, కలీమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

'ప్లాస్టిక్ వాడకం నిర్మూలిద్దాం'

శింగనమల: పర్యావరణాన్ని కాపాడానికి ప్రజలందరూ తమ వంతు బాధ్యతగా ఒకసారి వాడిన ప్లాస్టిక్ వాడరాదని, ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలిద్దామని ఇన్‌చార్జి ఎంపీడీఓ భాస్కర్ ఒక ప్రకటనలో సూచించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ప్రతి ఒక్కరూ జ్యూట్ బ్యాగులు, బట్ట సంచులు వాడాలని కోరారు. ప్లాస్టిక్ వాడడం తగ్గించడం ద్వారా భూమి, జనవనరులు కలుషితం కాకుండా పర్యావరణాన్ని పరిరక్షించుకుందామన్నారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణం దినోత్సవంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించడం దిశగా శింగనమలలో కార్యక్రమాలను నిర్వహిద్దామని, ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సమష్టి కృషితోనే వాల్మీకుల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

బుక్కరాయసముద్రం: సమష్టి కృషితోనే వాల్మీకుల అభివృద్ధి సాధ్యమని ఉమ్మడి జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కులప్ప అన్నారు.
ఆదివారం స్థానిక వాల్మీకి ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన 2 వేల మంది వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వాల్మీకి ఉద్యోగ సంఘం నాయకులు చైతన్యకుమార్, పవన్‌కుమార్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ ఈశ్వర్, న్యాయవాది చంద్రశ్వర్లహరి, కోనయ్య, అక్కులప్ప, సాకే నరేష్, తదితరులు పాల్గొన్నారు.



పుట్లూరులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెద్దవడుగూరులో పూర్వ విద్యార్థుల కలయిక

• పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పుట్లూరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2009–2010 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం చేపట్టారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఎంఈఓ శ్రీదేవి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు గురువులను సన్మానించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, అప్పటి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండలంధిలోని మర్తాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం 1999–2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులు ఆంజనేయులు, క్రిష్ణమూర్తి తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు భాస్కర్‌రెడ్డి, సుబ్బు, ఎర్రిస్వామి, నరేంద్రనాథ్‌రెడ్డి, సుధాకర్, వన్నూర్ వలి తదితరులు పాల్గొన్నారు.



గార్లదిన్నె మండలం మర్తాడు హైస్కూల్లో పూర్వ విద్యార్థుల కలయిక

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 1996–2000లో చదివిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వీర జవాన్ కుమ్మెత సుదర్శన్‌రెడ్డి స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానికంగా ఉన్న ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు అప్పట్లో పాఠశాలలో చేసిన అల్లరి పనులను గుర్తుకు చేసుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులు, కుటుంబంలో తల్లి కాని తండ్రిని కానీ కోల్పోయిన మెరిట్ విద్యార్థులకు సహాయం అందించడానికి కృషి చేస్తామన్నారు.

బండి వెళ్లాలంటే.. మురుగు తొక్కాల్సిందే!



బురదలో వాహనం ఆగిపోవడంతో తోసుకెళ్తున్న దృశ్యం

గుంతకల్లు: పట్టణంలోని సరస్వతీ విద్యామందిరం సమీపంలోని రైల్వే వంతెన (గుంతకల్లు–గుత్తి రైలుమార్గం) గుండా వెళ్లడానికి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్య ఒక ఎత్తు అయితే శని, మంగళవారాల్లో కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల రద్దీ మరింతగా ఉంటుంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని పత్తికొండ, కసాపురం రోడ్డుకు అనుబంధంగా ఉన్న వన్ ట్రాఫిక్ రోడ్డు సరస్వతీ విద్యామందిరం వద్ద ఉన్న రైల్వే మోరీలో నుంచి మళ్లించారు. అయితే ఈ మార్గంలో నిత్యం మురుగు నీరు నిల్వ ఉంటుంది. ఇక చిన్నపాటి వర్షం వస్తే ఈ మార్గం మొత్తం బురదమయంగా మారుతుంది. దీంతో వాహనాలు దారులు మురుగు తొక్కనిదే ముందుకు వెళ్లలేని పరిస్థితి. బురద, చెత్తాచెదారం పెరిగి దుర్వాసనతో వాహనాదారుల బాధలు వర్ణీనాతీతం. అంతేకాకుండా హిందూ శ్మశాన వాటిక ఈ మార్గంలోనే ఉండటంతో మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వాహనదారులు, పాదచారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గుత్తి: పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్, రాయల్ సర్కిల్, గాంధీ సర్కిల్, బస్టాండ్ ఏరియాలో ఆదివారం పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్‌ఐలు సురేష్, ఆశా బేగం ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్, లైసెన్స్, ఆర్‌సీలు లేని వాహనదారులపై జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐలు మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు.

బైక్ బోల్తా.. ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని కర్నూలు రోడ్డు వద్ద మోడల్ స్కూల్ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆటోను తప్పించబోయి బైక్ బోల్తా పడిన ఘటనలో రాము, అప్పయ్య లు గాయపడ్డారు. వివరాలు.. ప్యాపిలికి చెందిన రాము, అప్పయ్య బైక్‌లో గుత్తికి వచ్చారు. తిరిగి వెళుతున్న సమయంలో మార్గమధ్యలో ఆటో అడ్డం వచ్చింది. ఆటోను తప్పించబోయి ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిన ఇద్దరినీ స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బుక్కరాయసముద్రం: మండలంలోని వెంకటాపురం గ్రామం సమీపంలో అనంతపురం– నార్పల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. అనంతపురం నగరంలోని సుశీలరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న ప్రసాద్ జేఎన్‌టీయూలో అటెండర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం రాత్రి ప్రసాద్ ద్విచక్ర వాహనంలో నార్పల వైపు వెళ్తుండగా వెంకటాపురం గ్రామం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోయింది. దీంతో ప్రసాద్ ముఖానికి, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పెద్దపప్పూరు: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థనారాయణ స్వామి క్షేత్రంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారికి అభిషేకాలు, ఆకుపూజలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు బాలసుబ్రమణ్యశర్మ, సుధీర్‌కుమార్‌శర్మ, సునీల్‌కుమార్‌శర్మ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. శని, ఆదివారాల్లో క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని ఈఓ సుబ్రమణ్యం తెలిపారు.

కోటంక'లో..



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అమ్మవారి శాలల్లో పూజలు





అలంకరణలో ముసలమ్మ తల్లి, పెద్దమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో వెలసిన ముసలమ్మ తల్లి దేవాలయం, సచివాలయం ఎదుట పెద్దమ్మ తల్లి ఆలయంలో వెలసిన అమ్మవార్లకు ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి.. అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.